


# టేకిట్ ఈజీ!! - 3

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





# -11-

## సిత్రాలు సూడరో...(మొదటి భాగం)

**గోపాలు** హైవే మీంచి ఎక్సిట్ తీసుకుని ఇంటి రోడ్డు పట్టాడు. దూరంగా ఎవరో పురుష మానవుడు గెంతులేస్తున్నాడు రోడ్డు మీద. కారు కాస్త వారగా ఆపి, ఆ కాండిడేట్ ని పిలిచి అడిగేడు "మగపుట్టుక పుట్టి ఈ దేన్సులేవిటి బెదరూసీపుగాను..." అని. ఆ బెదరు ఓ సారి సీరియస్ గా చూసి

**"సిద్ధేంద్రస్య, భరతస్య, కూచిపూడస్య, భరతపూడశ్చ,**

**ఇదానీం త్వాం పురుషామ్యామ్యాం నా కరోతిం క్యా నృత్యం ? "** అనేసి గెంతడం కంటిన్యూ చేసాడు.

గోపాలు బిక్క మొహంవేసి "ఒక్క ముక్క అర్థవైతే నీ పావుకోళ్ళెట్టి కొట్టు. బాబ్బాబు నీకు పుణ్యముంటది, అదే ముక్క తెలుగులో చెప్పు, శాంస్క్రిట్ తో పెద్దగా టచ్ లేదు, ఏదో మార్కులొస్తాయని ఇంటర్మీడియెట్ లో తీసుకున్నా" అన్నాడు గోపాలు పాలిపోయిన నవ్వోటి నవ్వుతూ.

"వోర్నీ, తెలుగోడివా. నువ్వు తెలుగులో మాట్లాడితే వేరే లేంగ్వేజ్ వాడివనుకున్నా. సర్లే, చెప్పొచ్చే ముక్కేటంటే నేను కలిపురుషుణ్ణి. నా పావుకోళ్ళు, కిరీటం, పట్టుపంచె గెటప్పు మరి అదిరుండలా?" అన్నాడు క.పు. గోపాలుకి బెంగట్టుకుంది. "నువ్వు కలి పురుషుడివా? నువ్వు దేన్సేస్తున్నావంటే, హమ్మో కొంపతీసి కలియుగం ఎండైపోతోందా?" అన్నాడు దీనంగా. "అంతలేదమ్మా, ఇంకా మీకు ఎదర చాలా వుంది సినిమా. ప్రస్తుతానికి ప్రెసిడెంట్ మారితన్నాడు. మీకు దిబిడి దిబిడే..." అన్నాడు అమితానందంగా. "అదేంటి, నీకు రిజల్ట్స్ అప్పుడే ఎలా తెలిసిపోయాయి? " అన్నాడు గోపాలు కంగారుగా. "అదిగో, ఆ ఎదవ కొచ్చెన్లే ఆపమన్నాను. ఆ మగాడొస్తే మీకు ఇత్తడే. తోక జాడిస్తే తోలు తీస్తాడు. ఆ ఆడావిడొస్తే మీకు కంచే. ఆవిడ స్టాపులో అంతా మీ పక్కదేశవోళ్ళే వున్నార్ట. ఎలా చూసుకున్నా మీకు కంచిత్తడో, ఇత్తడికంచో ఖాయం. అందుకే నా నృత్యం" అన్నాడు సంతోషంగా. "అసలు మేవంటే నీకెందుకింత కోపం, వై యార్?" అన్నాడు గోపాలు ఫ్రెండ్లీగా. "అదిగో, ఆ ఎదవ "యార్" లే వద్దన్నాను" అన్నాడు క.పు సంకలెగరేస్తూ.

"అదేంకుదర్దు. అసలు మేవంతా ఏంతప్పు చేసామమ్మా? సాంపిల్ కి రెండొడులు." అన్నాడు గోపాలు.

"అంతా కాదు. కొంత మంది చేస్తున్నారు. అందరికీ చెడ్డపేరు తెస్తున్నారు. ఒకటి జాతర్లు పెట్టడం, రెండు గుళ్ళ పేరుతో ధంధాలు చేయడం.."

"అదేంటి? జాతర అనగా హమారా పరంపరా హై, సంస్కృతీ హూన్, వహాన్ తరహ్ తరహ్ కే అచ్ఛే కార్యక్రం హై. అలాగే గుళ్ళు చాలా డిమాండ్ హై. తో మేం కడతాం హూం.."

"డొక్కలో పొడిచి డిక్కీలో తొంగోబెట్టేత్తా హై. మీ జాతర సిత్రాలు చూస్తావా? ఈ మజ్జనే సీక్రెట్ కెమేరాలెట్టి సినిమా తీసాం. చూడు.." అంటూ గోపాలు కళ్ళకి అంజనం పూసాడు క.పు. అంతే సీనుమారిపోయింది. సినిమా మొదలైంది.

" ఈ చిత్రములోని సన్నివేశాలు ఏ ఒక్కరినో ఉద్దేశించినవి కావు. అసలివి అంగారక గ్రహంలో జరిగిన సంగతులు. కాబట్టి భుజాలు తడుముకోవడం, వీపు గోక్కోవడం నిషిద్ధం హై."

అసలీ అంగారక గ్రహానికి ఏమయింది? ఎక్కడ చూసినా సా.వ (సామాజిక వర్గ) గుంపులు. అందరూ లాంగ్వేజి పేరెట్టుకుని ఇష్టమొచ్చిన గ్రూపులుగా విడిపోయి తన్నేసుకుంటున్నారు. వీళ్ళని బాగు చేయడం ఎలా? (న్యూస్ రీల్ పూర్తైంది.)

కట్ చేస్తే అంగారక గ్రహంలో టోటల్ లాస్ అనే ఊరిలో మొదటి బోర్డ్ మీటింగ్ హాలు.

ముందు ఒకాయన లేచి "లాస్, బైలాస్" చదివారు. దానిలో ఒకరినొకరు అమాంతం పీకినొక్కి ఎందుకు చంపెయ్యకూడదో, వేదిక మీద ఒక లీడరు మరొక లీడర్ని మర్డర్ ఎటెంప్ట్ ఎందుకు చెయ్యకూడదో, అది ఏ బైలాస్ ప్రకారం చట్ట విరుద్ధమో చదివి, సుత్తి కొట్టి, చివరికి సుత్తి తో డెస్కు మీద కొట్టి కొత్త బోర్డ్మెంబర్లని ఎన్నుకునే కార్యక్రమానికి తెర తీసాడు. వెంటనే ఓ నలుగురు నల్లకోట్లవాళ్ళు ఆ తెర చించేసారు. ఇద్దరు బూడిద రంగు కోట్లవాళ్ళు వెంట తెచ్చుకున్న టియర్ గేస్ బాంబులు పళ్ళతో కొరికి, పక్కోడి కళ్ళల్లోకి విసిరేసారు. మరో ఇద్దరు మైకు కాడతో రౌండ్ టేబిల్ దగ్గరున్న వాళ్ళ గుండు మీద పొడుస్తున్నారు. వీళ్ళెవ్వరూ బైటికెళ్ళకుండా తలుపులన్నీ బిడాయించేసారు. వీళ్ళెవ్వరికీ కనపడకుండా సీక్రెట్ రికార్డింగ్ నడుస్తోంది. వోటింగ్ మొదలైన నాలుగు గంటలకి సా.వ పెద్దలందరూ వచ్చారు. లంచ్ అమృతంలా వుండడం వల్ల అందరూ దేవతల లెవెల్లో మత్తుగా చూస్తూ కూర్చున్నారు. ఏ.సీ ఇంకాస్త పెంచేసరికి ఆల్మోస్ట్ అందరూ నిద్దరోయారు. మిగిలిన ఇద్దరూ "ఐ ప్రపోస్, ఐ సెకండ్" అనేస్తున్నారు, రెండు నిమిషాలకోసారి. అన్నీ విని మొదటి శాల్తీ మళ్ళీ సుత్తితో కొట్టేసి "ఐ డిక్లేర్ ద న్యూ టీం నౌ" అనేసి వాళ్ళ పేర్లు చదివేసాడు. వెంటనే టీవీ 12345 వాళ్ళు కొత్త బోర్డు మెంబర్ల దగ్గర వీడియో బైట్లు తీసుకున్నారు. ఆనక సాయంత్రం అందరూ కలిసి విందు చేసుకున్నారు.

మర్నాడుదయం మళ్ళీ జాతర లొకేషన్ డిసైడ్ చెయ్యడానికి ఇరవై సుమోలూ, నలభై క్వాలీసులు అవసరం పడ్డాయి. చివరికి ఆల్ఫా ట్వెంటీవన్ అనే ఊళ్ళో చెయ్యడానికి బెదిరింపుల ద్వారా ఏకాభిప్రాయం కుదిరింది. మూడోరోజు భూలోకం నించి వచ్చిన కళాకారులతో ఎంతో సుహృద్భావ వాతావరణంలో సాంస్కృతిక వేడుకుల సాంపిల్స్ జరిగాయి. అందరూ అన్నదమ్ముల్లా కళాకారులందరితో కలిసి మెలిసి, రాబోయే జాతర ఎంత హాయిగా వుండబోతోందోనని మురిసిపోతూ ఇళ్ళకెళ్ళారు.

*కట్ చేస్తే--------జాతర కి రెణ్ణెల్లముందు..*

ముందు నాలుగు పోలీస్ వేన్లు, వెనక ఐదుగురు స్పెషల్ కమాండోస్ జీపులు – మధ్యలో జాతర కమిటీ మెంబర్లు లిమోలలో దిగారు. అందరూ హోటల్ లోకి వెళ్ళిపోయాకా కొంతమంది చలిలో వణుకుతూ వచ్చారు వెన్యూకి. వాళ్ళు "లిటెరరీ కమిటీ వాళ్ళు". బడ్జెట్ లేకపోవడం చేత వాళ్ళు వాళ్ళ వాళ్ళ ఊళ్ళనించి నడిచి వచ్చారు. వాళ్ళకి బొచ్చెల్లో కాసిన్ని నీళ్ళిచ్చి, రోడ్డుపక్క ఓ వారగా మీటింగ్ కానిచ్చేయమన్నారు. హోటల్ లో అసలు ఖాళీ లేదన్నారు. వాళ్ళు బేలగా నవ్వి, ఒకరినొకరు పరిచయం చేసుకుని ఫుట్ పాత్ మీద మీటింగ్ మొదలెట్టారు. ఆ తరవాత ఓ ఇరవై మందిని అందరూ రాళ్ళేసి కొడుతున్నారు. తమ ప్రోగ్రాం ఏర్పాటు చెయ్యకపోతే మర్యాద్దక్కదని కొందరు వెంటపడి మరీ బెదిరిస్తున్నారు వాళ్ళని. వాళ్ళు పరుగు పరుగున వచ్చి ధభాల్న హోటల్ తలుపులు తోసి లోపలికెళ్ళి వెంటనే తలుపులు మూసేసారు. వాళ్ళు కల్చరల్ కమిటీ వాళ్ళు. రక్తాలోడుతూ రూం లోకొచ్చారు కల్చరల్ కమిటీ మెంబర్లు. వాళ్ళకి బేండెయిడ్లిచ్చి పంపేసారు మిగితా కమిటీలవాళ్ళు. వాళ్ళు ఓ మూల రూంలో కూర్చుని మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఎలా కార్యక్రమాలు చెయ్యాలా అని తీవ్రంగా చర్చిస్తున్నారు. ఫైనల్ గా వాళ్ళందరికీ కొన్ని టెక్స్ట్ మెసేజిలొచ్చాయి పైనించి. ఆ ప్రకారంగా ఎప్పట్లాగే ప్రోగ్రాం మొత్త డిసైడైపోయింది. హాల్లో

మళ్ళీ అమృతం పారింది. అందరూ దేవతలైపోయారు. కల్చరల్ టీం వాళ్ళకి సాఫ్ట్ డ్రింక్స్ ఫ్రీగా ఇచ్చారు. లిటెరరీ కమిటీ వాళ్ళకి ఇంకో గంట ఫుట్ పాత్ వాడుకోడానికి అనుమతిచ్చారు.

*కట్ చేస్తే -- జాతర*

భూలోకం నించి ఆడ, మగ తారలన్నీ వాలిపోతాయని ఫ్లైయర్లేసారు. పిలిచిన వాళ్ళకీ, వచ్చిన వాళ్ళకీ అట్టే సంబంధం లేదు. ఏదో పదిమంది కుర్ర హీరోయిన్లూ, మరో పది ఏంకర్లూ, పన్నెండుమంది సింగర్లూ, రాజకీయ నాయకులూ అందరూ వచ్చేసారు. బేంక్వెట్లో అమృతం సముద్రాన్ని ఏర్పాటు చేసారు. గానా బజానాలూ, ఫ్రీంచ్ కట్ లూ, కొత్త కోట్లతో కళకళాలాడిపోయింది. తెలుగుదనం అణువణువునా కనిపించేసింది. స్టేజిమీద ఐటెం సాంగ్స్ తో ఇరగదీసేసారు అంగారక డాన్స్ అకాడమీలు. మర్నాడు ఉదయం ఇనాగరల్ కార్యక్రమం. స్పీచ్ ఇచ్చి వెళిపోయారు ప్రెసిడెంట్ గారు. స్పీచ్ ఇద్దామని ఆలోచిస్తున్నారు ప్రెసిడెంట్ ఎలెక్ట్ గారు. ఇంతలో తెలుగు రాష్ట్రాలు, వాటి చరిత్ర, వేగిన చాళుక్యులు, వేగని పల్లవులు, ఉడికిన నరేంద్రులు, స్పైసీ భూపతులు అంటూ మొదలెట్టి ఓ ముప్పై నాలుగు చరణాల పాట, దానికి తగ్గట్టు డేన్సు స్టెప్పులు మొదలై, సుమారు ఓ ఎనిమిది గంటల సేపు నడిచాయి. అదయ్యేసరికి అందరూ డిన్నరు పూర్తిచేసుకుని వచ్చి కూర్చున్నారు. ఎవరో ఒకావిడ ఏకకాలంలో ముక్కుతో నాట్యం చేస్తూ జెడతో ముగ్గు వేసే కళని ప్రదర్శించింది ఓ గంట సేపు. ఆవిడని కొంతమంది బహిరంగంగానే విసుక్కున్నారు. వాళ్ళెవ్వరూ మళ్ళీ ఆ పరిసరాలలో కనబడలేదు. వారి దుస్తులు వారి జ్ఞాపకంగా వారిళ్ళకి చేరాయి. ఆనక ఓ నలభై శాస్త్రీయ నృత్యాలు, ఎనభై బృంద గానాలు ప్లాన్ చేసారు కానీ, అవో రెండు, ఇవో రెండు అయ్యాయి. వెంటనే లిప్ సింక్ సంగీత విభావరి కార్యక్రమం అద్భుతంగా జరిగింది. అప్పటికే అమృతం తాగేసి దేవతలైపోయి ఉండటం చేత కొందరికి వేదికమీద వున్నవారంతా ఇంద్ర సభలోని కళాకారుల్లానే అనిపించారు.

ఆ గెంతులయ్యేసరికి అర్థరాత్రయింది. జాతర వాడు పారా మిలటరీ దళాలనీ, నేవీ సీల్స్ నీ పట్టుకొచ్చి మెషీన్ గన్నులతో బెదిరించి, సమయం దాటిపోయిందని హెచ్చరించి, సర్జికల్ స్ట్రైక్ చేయించిన తరువాత, అందరూ జాతర హాల్ నించి హోటళ్ళకి చేరుకున్నారు. ఆనక మళ్ళీ కొదరు దేవతలైపోయారు. రెప్పలెయ్యడం కూడా మానేసారు. పోకర్ తుఫానుల్లో కొట్టుకుపోయారు.

రోజూ ఉదయం మొదటి అరగంట వేడి ఉప్మా పేస్టు, తరువాత గంట ఉప్మా పేస్టు, ఆనక ఉప్మా, తరువాత ప్మా పెట్టారు. లంచ్ లో ఇరవై రకాల పేరు తెలియని పిండివంటలు, పుల్ల బొబ్బట్లు, డిన్నర్ లో నాలుగు రకాల సాంబార్లతో అద్దరకొట్టేసారు. అందరికీ ఇంటి తిండిమీదకి మనసుపోయింది. పాపం మాటలు, మా ఆవిడకూడా బానే వండుతుందనుకున్నారు మొగాళ్ళు. ప్రతి శనివారం మొగుళ్ళకి వంట చేసి పెట్టాలనుకున్నారు ఆడాళ్ళు. మధ్య మధ్యలో కారిడార్లో ఓ నలుగురైదుగురు కలిసి సాహితీ కార్యక్రమాలు చేసుకున్నారు. ఒకరి పుస్తకం రిలీజ్ కి మిగితా నలుగురూ చప్పట్లు కొట్టారు. ఒకరి స్వాగతోపన్యాసానికి తతిమ్మా నలుగురూ హాయిగా నిద్దరోయారు. లేచాకా టీతాగి తెలుగు భాష గొప్పదనం గురించి చర్చించుకుని, భుజాలు చరుచుకున్నారు. తెలుగుభాష గొప్పదనంపై గొప్ప పులిహార ప్రవచనం ఒకటి నడిపించారు నలుగురూ కలిసి. చీరలమ్ముకునే వాళ్ళ దగ్గర్నించి, లక్కవరంలో లగ్జరీ ఫ్లాట్లమ్మేవాళ్ళదాకా అందరూ స్టాల్సు పెట్టి మరీ కుమ్మేసారు. అదివారం సాయంత్రానికి కళాకారులు విమానాలెక్కి భూలోకానికెళిపోయారు. వ్యాపారులంతా లాభ నష్టాలు లెక్కలేసుకోడంలో బిజీగా వున్నారు. టిక్కెట్లు కొనుక్కొచ్చిన ప్రేక్షకులకి అచిరకాలంలోనే సీమంతం జరిగినంత పనైంది. ఈ అద్భుతమైన జాతర కి సుమారు మూడు మిలియన్ల డాలర్లు ఖర్చు అయ్యాయని, అయితేనేం ఇరవై వేలమంది వచ్చారనీ, తెలుగు జెండా మళ్ళీ రెప రెపలాడిపోయిందనీ ఛానెళ్ళన్నీ కూత పెట్టాయి.

పైకి కనపడని పోలీసు దెబ్బలు తిన్న సాంస్కృతిక, సాహితీ కమిటీలు స్వచ్ఛందంగా లెంపలేసుకున్నాయి. మళ్ళీ సంఘ సేవ జోలికి పోమని బిడ్డల మీద ప్రమాణాలు చేసేసారు ఆ కమిటీ మెంబర్లు. వాళ్ళు అంగారకదర్శి లో చేరి వాళ్ళ జీవితాలు బాగుచేసుకున్నారు."

గోపాలు: అజ్జి బాబోయ్, అంగారక గ్రహంలో ఇల్లా.. జరుగుతాయా జాతరలూ...

క.పు : నీకలా అర్థమైందా. అలాక్కానీ. ఇది మొదటి మిస్టేక్...

గోపాలు: మరి రెండోది..

క.పు : అక్కడికే వస్తున్నా. అలా మీ ఇంటికెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం పద..

గోపాలు: పద, కానీ నేను కాఫీ తాగను.

క.పు : నేను తాగుతాను. మూసుకుని పద..

గోపాలు: సరే పద..

(సశేషం)

Post your comments